లేదు. నే నింకా ఏమేమి చూడాల్సి వస్తుందో ఇలా బ్రతికి." దుఃఖంలో గొంతు బొంగురుపోగా ఓ ముసలిదాని, బహుశా తల్లిలాగుంది, ఆక్రందన.

ఈమాటు దగ్గు చాలాసేపు సాగింది. ఏవేవో శబ్దాలు కలగాపులగంగా.

తెలతెలవారుతోంది. పక్షుల కిలకిలా రావాలు మొదలైపోయాయి. ఉదయాద్రి కెంపు రంగు పులుముకొంటూంది.

"అత్తా. లేచావా?" అంటూ వచ్చింది నందిని.

నుదుట కళ్యాణతిలకం, బుగ్గన చుక్క, పొడవైన జడ. జడలో ఒత్తుగా మల్లెలు, కనకాంబరాలు. కనకాంబరంరంగు పట్టుచీర కట్టుకుంది. చేతులకి, మెడలో నిండుగా ఆభరణాలు, కెంపుల జుంకాలు ఆమెకి మరింత అందా న్నిచ్చాయి.

"తన దిష్టే తగులుతుందేమో పిల్లకి" అనిపించిం దావిడకి.

"మీకు సంగీతం బాగా వచ్చు కదత్తా?" ఉత్సాహంగా అడిగింది నందిని.

"ఏదో కొద్దిగా. అవును గానీ, ఎవరూ ఇక్కడ సంగీతం పాడుతున్నది?" సందేహంగా అడిగింది. రాజేశ్వరమ్మ.

"ఆయనా- మా మేస్టా రత్తయ్యా. ఇదిగో ఈ పిట్టగోడ దగ్గరకు రా. ఈ పక్కనుంచి వాళ్ళిల్లు కనిపిస్తుంది. ఎవరికీ ట్యూషన్ అంటూ ప్రత్యేకంగా చెప్పరు. నేనే వెళ్ళి బలవంతాన చెప్పించుకుంటూ ఉంటాను అప్పుడప్పుడు. కాలేజీ చదువుకి వచ్చాక ఆ అవకాశం కూడా తప్పిపోయిం దత్తయ్యా. కానీ నా కాయన అంటే ప్రత్యేకమైన అభిమానం ఉంది. అప్పుడప్పుడు రేడియోలో పాడుతుంటారు. ఈమధ్య అదీ లేదు. ఆయన ఆరోగ్యం పాడైపోయింది. ఆయనకి సంగీత మంటే ప్రాణం. ఎప్పుడూ ఆయన నుంచి ఏవేవో రాగాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన ఇల్లు కోవెలలా ఉంటుంది. అరిగో. ఇలారా. ఆయనే... ఆయనే మా మేస్టారు." చేయి చాపి చూపించింది నందిని.

బాగుండదేమో అనిపించినా, ఉత్సుకత కొద్దీ తొంగి చూసిం దావిడ.

పూలసజ్జలో పూలు కోస్తున్నారు. వెనుక భాగం మాత్రమే కనిపిస్తూంది. ఆజానుబాహువు లాగున్నారు. పచ్చాటి ఒంటిమీద జంధ్యం వేలాడుతోంది. కట్టిన పంచకు అక్కడక్కడ మాసికలు. ఏదో రాగం సన్నగా తేలి వస్తోంది ఆ దిక్కునుంచి.

"పేరేమిటి?" మెల్లిగా అడిగిం దావిడ.

"నందినీ. ఇలారా !" కింద నుంచి గట్టిగా పిలిచింది జానకమ్మ.

"రా అత్తా. కింద చాలా పను లున్నాయి." గబగబా చేయి పట్టుకుని లాక్కుని వెడుతూ అంది నందిని.

"ఆయనకి ఈమధ్య దగ్గు విపరీతం అయిపోయిం దత్తా. గుంటూరు వెళ్ళి చూపించుకుందామని అనుకుంటున్నారు. పెద్ద డాక్టరు ఇవాళ అప్పాయింట్‌మెంటు ఇచ్చాడుట. వెళతారు. లేకపోతే నా పెళ్ళికి కచేరీ చేస్తాననే వా రెప్పుడూ." విషాదంగా అంది నందిని.

"ఇక మాస్టారి సంగతెత్తుతే ఒళ్ళు తెలియదు దీనికి. అవతల బోలెడు హడావిడిగా ఉంది. ఆ ముసల్ది ఇంటి తాళం ఇచ్చి, ఎవరేనా వస్తే చూపించండని మనకి చెప్పింది." ఉప్మాకి కావలసిన సరుకులు వంటవాళ్ళ కిస్తూ అన్నది జానకమ్మ.

"ఎందుకు?" అనాలోచితంగా అంది రాజేశ్వరమ్మ.

"ఎందుకేమిటి? ఊరంతా అప్పులు చేశారు. తాతల నాటి ఇల్లు. పైసా సంపాదన లేదు. ఓ రెండెకరా లున్నట్లున్నాయి. ముక్కు మూసుకు కూర్చుంటామంటే గడిచే రోజులా. పైగా ఆయనకేమో క్షయ అనుకుంటున్నారు."

ఆఖరి మాట రాజేశ్వరమ్మ చెవి దగ్గర కొచ్చి రహస్యంగా చెప్పిం దావిడ. "కొంచెం మతి కూడా స్తిమితం తక్కువ" అనుకొంటారు జనాలు. అదృష్టం కొద్దీ పెళ్ళి పెటాకులూ లేవు. వయసులో ఉండగా ఏదో వ్యవహారం నడిపాట్ట, ఇక్కడ కాదులే, అదేదో ఊరు, ఎప్పుడూ ఆ ముసలావిడ మాకు చెప్పదు. అయినా మన కెందుకు. ఇదిగో జీడిపప్పు దోరగా వేయించు. డాల్డా వద్దు. పైన నెయ్యి వెయ్యి.

"ఆ. అక్కడ చావగొట్టి పంపారుట. ఎప్పుడూ చిన్ననాటి మాటలే. మంచివాడే పాపం. కర్మ." ఏదేదో వంటవాళ్ళకి పురమాయిస్తూ, దండకంలా చెప్పింది జానకమ్మ.

మనసు ఎందుకో గాని కలుక్కుమంది రాజేశ్వరమ్మకి. నందినితో రహస్యంగా చెప్పింది తన కా ఇల్లు చూడాలని ఉందని.

అలాగే నన్నది నందిని.

మధ్యాహ్నం దాకా అన్యమనస్కంగా గడిపిం దావిడ. ఇంట్లో హడావిడి పెరుగుతోంది.

మధ్యాహ్నం రెండయింది, పెళ్ళివారితో సహా భోజనాలు తెమలడానికి.

సాయంత్రపు ఫలహారాల ఆలోచనలో ఉంది జానకమ్మ.

"అమ్మా. మాస్టా రిల్లు చూడ్డానికి వచ్చారు." ఒగరుస్తూ వచ్చాడు పన్నెండేళ్ళ బాబీ.

దిగ్గున లేచి కూర్చుంది రాజేశ్వరమ్మ.

"వీళ్ళకేమీ పని లేనట్లు, ఇప్పుడా? బావుంది." విసుక్కుంటూ లేచింది జానకమ్మ.

"అమ్మా ను వ్విక్కడ లేకపోతే ఇబ్బంది. అత్త ఖాళీగానే ఉంది కదా. ను వ్విక్కడ ఉండు. అత్తనీ, బాబీనీ పంపు" అంటూ "ఏమత్తా ! వెళ్ళి చూపించడమే. వెడతావా?" అంది నందిని.

"అలాగే" వెంటనే లేచింది రాజేశ్వరమ్మ.

"చూపించిరామ్మా వదినా. ఇదిగో మాట. ఎంతలో ఉందంటారు అని అడిగితే పది వేలని చెప్పు. అప్పులు పోను మిగిలితే, ఆ పేద బ్రాహ్మడు వైద్యం చేయించుకోవాలి కదా." రహస్యంగా చెప్పిం దావిడ.

ఇల్లు చూస్తూనే పెదవి విరిచా డా ఆసామీ. గోడ కదిలించాడు. ఇటుక రాలిపడింది అలికి ముగ్గులు పెట్టిన వాకిట్లో.

"అబ్బే. నూరేళ్ళు నిండినట్లుందండీ. ఉండడానికేమీ పనికొచ్చేట్టు లేదు" అన్నాడు.

తలుపులు తీసి లోపలికి అడుగు పెట్టింది రాజేశ్వరమ్మ. నందిని అన్నట్లుగా ఒక దివ్యమైన అనుభూతి కలిగింది ఆవిడకి.

"బాగుంది. ఇల్లు మట్టి జాగాయే. గచ్చులు కూడా లేవు. ఇంట్లో ఫోటోలు తప్పించి సామా నేమీ లేదే?" అంటూ పైకి తలెత్తిన అతను "బాబోయ్. సూర్యచంద్రులు ఇంట్లోనే ఉన్నట్లున్నారు. అయిదు వేలకి ఇచ్చినా దండగే. ఇక తెరవకండమ్మా తలుపులు. రెండ్రోజుల్లో నే వచ్చి వాళ్ళతో మాట్లాడుకుంటాను." అంటూ వెళ్ళిపోయా డాతడు.


అప్పుడు దృష్టి నలువైపులా సారించింది రాజేశ్వరమ్మ. ఇంటి నిండా పెద్ద పెద్ద ఫోటోలు. త్యాగరాజు, పురందరదాసు, శ్యామాశాస్త్రి, అన్నమాచార్య, క్షేత్రయ్య మొదలైన విద్వాంసులు కొలువు తీర్చినట్లుంది అక్కడ.

ఫోటోల రంగులు వెలాతెలా పోతున్నాయి. నిత్యం ఆరాధన జరుగుతున్నట్లు గుర్తుగా అగర్‌బత్తీలు, నాగమల్లి, గరుడవర్ధనం, గన్నేరు పూలు వాడకుండా సుగంధాలు వెదజల్లుతున్నాయి. ఓ మూల తంబుర ఉంది. ఓ పాత కుర్చీ, రెండు మంచాలు.

"అత్తా. నే నాడుకోనా?" బితుకు బితుకుగా అడిగాడు బాబీ.

ఒక్కసారి స్పృహ వచ్చినట్లైంది ఆవిడకి.

"అలాగే నాన్నా నే నిక్కడ ఓ పది నిముషా లుండి వస్తాను. అమ్మతో చెప్పు" అన్న దావిడ.



వాడు తుర్రుమని పారిపోయాడు.

ఆ గది తన కెంతో పరిచయం ఉన్నట్టు, అందులో ప్రతి వస్తువూ తన కెంతో సన్నిహితమైనదే నన్న భావం ఆవిడకి ప్రతి అణువులోనూ కలగసాగింది.

మెల్లిగా కిటికీ తలుపు తెరిచిం దావిడ. ఎదురుగా ఓ యువకుడి ఫోటో. పాతదేమో ఫోటో కూడా బాగా మాసిపోయింది. దగ్గరగా వెళ్ళి చూసిం దావిడ. శరీరంలో ప్రతి అణువూ ఆలావన చేస్తున్న అనుభూతి. అప్రయత్నంగా దుఃఖం పొంగి వచ్చిం దావిడకి. అక్కడున్న కుర్చీలో కూలబడిం దావిడ.

మనసు జ్ఞాపకాల గవాక్షాలని, ఒకదాని తరువాత ఒకటి తెరుచుకుని పదమూడేళ్ళ చిన్నారి రాజేశ్వరి దగ్గర ఆగింది.

** ** **

సాయంత్రం నాలుగు కావస్తోంది. తోటలో ఉయ్యాల ఊగుతోంది తాను.

తమది చాలా పెద్ద తోట. తండ్రి భూపతి ఓ పిల్లజమీందారు. ఆయనకి మొక్కలంటే సరదా. గులాబీలు, మల్లెలు అంటే మరీను. ఎక్కడెక్కడి నుంచో తెప్పించి మరీ వేయించేవా రాయన. అరడజను పెద్ద మామిడి చెట్లుండేవి. మామిగున్నలకి మాలతీలతలు అల్లుకుని చాలా అందంగా ఉండే దక్కడ. సాయంవేళ అవుతూంటే మాలతిపూవులు విచ్చీ విచ్చక కమ్మని సువాసనలు వెదజల్లుతూ, పక్షుల కిలకిలా రావాలతో ఎంతో ఆహ్లాదంగా ఉండేది తనకి.

"రాజులమ్మగోరూ. అయ్యగారు బేగి రమ్మంతన్నరు" అంటూ వచ్చాడు రంగన్న.

"ఎందుకు?" ఆగకుండానే అడిగింది తాను.

"ఎవరో సంగీతం పంతులు వచ్చినారంట."

"నే న్రానని చెప్పు. నా కొద్దు." విసుగ్గా అంది తాను.

తండ్రికి సంగీతమంటే సరదా. తనని ఓ మాదిరి విద్వాంసురాల్ని చేయాలన్నది ఆయన కోరిక. అందుకని పేపరు ప్రకటన కూడా వేయించారు.

"ఓపాలి సూసిపోండి తల్లీ. మీకు నచ్చకపోతే, అన లాయనకి ఉజ్జోగ మెవురిస్తారు?" బ్రతిమాలుతున్నట్లుగా అన్నాడు వాడు.

అయిష్టంగానే ఉయ్యాల దిగింది తాను.

పట్టు లంగా సద్దుకుని, ఓణీ ఒంటినిండా కప్పుకుని, జడకుప్పెలు చేత్తో పట్టుకుని లోనికి నడిచింది.

బయటకే వినసొంపుగా చక్కని కీర్తన వినబడుతోంది.

"ఎందా...రో మహానుభావులు"

పెద్దగా సంగీత జ్ఞానం లేకున్నా ఆ సమయంలో ఆయన ఆలాపన ఎంతో మధురంగా అనిపించిం దామెకి. మెల్లిగా తలిదండ్రుల మధ్యకి చేరింది తాను.

కళ్ళు మూసుకుని గానం చేయడం అతని అలవాటు లాగుంది. నీర్కావి పంచా, లాల్చీ. పచ్చని శరీరచ్ఛాయ. నుదుట గంధం బొట్టు. ఆపైన కుంకం అద్దారు.

సంగీతం మాస్టారంటే ముసలాళ్ళే ఉంటారని అనుకుంది తాను అప్పటిదాకా. ఇలా పాతిక సంవత్సరాల లోపు వ్యక్తి కూడా మాస్టా రనడం తన కెంతో ఆశ్చర్యం కలిగించింది. ముక్కుపొడుం అలవాటు లేకపోవడంతో ఆయన నచ్చారు.

అందుకే తండ్రి అతన్ని గురువుగా నిర్ణయిస్తుంటే మరేం అభ్యంతరం చెప్పలేకపోయింది తాను.

తల్లి తప్పించి ఎవరూ లేరుట. తోటలోని ఔట్‌హౌస్‌లో అతని బసకు తండ్రి ఏర్పాటు చేయించారు. మరో వారం రోజులనాడు తల్లితో సహా దిగా రాయన. అతని పేరు శివశంకరం అని తండ్రి ద్వారా తెలిసింది తనకి.

ప్రతి రోజూ పొద్దున్న సాయంత్రం ఓ గంట పాఠాలు చెప్పేవా డాయన. సాయంత్రం మాత్రం తల్లీ, తండ్రీ దగ్గరే కూర్చుని వినేవారు. పాఠాలు కాంగానే, వారి కోరికమీద ఏదో ఒక కీర్తన మాస్టారు ఆలపించడం అలవాటుగా మారింది. తనకి ఆయన దగ్గర నేర్చుకోవడం కన్నా ఆయన పాడుతుంటే ఎంతో హాయిగా ఉండేది. ఆ సమయం ఎప్పుడు వస్తుందా అన్నట్లు ఎదురుచూసేది తాను.

ఒక ఏడాది గడిచింది.

ఇద్దరి మధ్యా చనువు ఏర్పడింది. ఒక్క గడియ ఆయన రావడం ఆలస్యమైనా తన కెంతో కష్టంగా ఉండేది. అంత చనువు ఏర్పడినా, శంకరం మాస్టారు మాత్రం చాలా జాగ్రత్తగా ప్రవర్తించేవారు.

ఓ సాయంత్రం తల్లికి పని తెమలలేదు. తండ్రి పొరుగూరు వెళ్ళారు. పాఠం కార్యక్రమం మామూలుగా ముగిసింది. రోజూ మాదిరి కీర్తన పాడకుండా లేవబోయారు మాస్టారు.

"అహా. ఏదైనా పాడవలసిందే" అంటూ ఆపేసింది తను.

ఆయన కళ్ళలో చిత్రమైన తళుకు. అలవాటుగా కళ్ళు మూసుకున్నారు. గొంతు సవరించుకుని మొదలుపెట్టారు.

"మరుగేలరా. ఓ రాఘవా"

ఆనందంగా వింటున్నది తాను.

"అన్ని నీ వనుచు అంతరంగమున
తిన్నగా వెదకి తెలిసికొంటి నయ్యా
నిన్నె గాని మది కెన్న జాల నొరుల"

అన్న సాహిత్యం తనని అమితంగా కలవరపరచింది. ఆయన మాత్రం మామూలుగా ముగించి "వస్తా"నని చెప్పి వెళ్ళిపోయారు.

ఆ రాత్రి సరిగా నిద్రపోలేకపోయింది తాను.

** ** **

"జున్ను విరిచాను. మీ మాస్టా రింట్లో ఇచ్చి రా". అంది తల్లి ఓ రోజు.

"రంగన్నతో చెప్పు. నేను పోను." విసుగ్గా అంది తాను.

"గురువుగారేగా? ఈమాత్రా నీ కేమీ అరిగిపోవు గానీ పోయిరా. రంగన్న నాన్నగారు బయటకు వెళ్ళారు. ఎప్పు డొస్తారో" అన్న దావిడ.

ఓ కేరేజీలో జున్ను పెట్టి ఇచ్చింది తల్లి. తీసుకుని బయలుదేరింది తాను. తమ ఇంటికి ఓ ఫర్లాంగు దూరం ఉంటుంది ఔట్‌హౌస్. తోటకి ఓ పక్కగా ఉంటుం దది. నాలు గడుగులు వేసిందో, లేదో చక్కని గానం తన చెవుల పడసాగింది.

"ఎప్పుడూ అలా పాడుకుంటూ ఉండడమేనా ఏమిటి ఈయన పని" అనుకుంది తాను.

గుమ్మంలో అడుగు పెట్టబోతుంటే అతని గొంతు మరింత స్పష్టంగా వినిపించసాగింది.


"కలికి ని న్నెడబాసినది మొదలు నీ రూపు కనులకు కట్టినటు లుండునే."

ఒక్క క్షణం గుండెలో అలజడి. శరీరంలో తెలియని ప్రకంపనాలు. "మాస్టారు గానీ తన రాక

## అర్ధాయుష్కుడైన మహాకాయుడు

• **1865** - 1912 మధ్య కాలంలో ఫ్రెంచి కెనడాలో లూయీ సిర్ అనే ఒక మహాకాయుడు ఉండేవాడు. ఆయన రొమ్ముని చూస్తే "ఇది గుండా? చాకలి బండా?" అని అనిపించేదట. 300 పౌన్లు బరువు ఉండిన ఈ బలశాలికి రొమ్ము కొలత 59 అంగుళాలు ఉండేదట. అంటే అంగుళం తక్కువగా అయిదు అడుగులన్న మాట. ఇంతటి పహిల్వానూ, 'నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకి నేల కూలిందట' అన్నట్లు అర్ధాయుష్షుతో 47 ఏళ్ళకే కన్ను మూశాడు.

-కె. ఆర్. కె. మోహన్



గానీ తెలిసి ఈ పాట పాడడం లేదుకదా'' అన్న అనుమానం వచ్చేసింది.

శబ్దం కాకుండా లోపలికి నడిచింది తాను. కళ్ళు మూసుకునే గానం చేస్తున్నా రాయన.

వంటింటి దగ్గర తనని చూస్తూనే ఉబ్బితబ్బిబ్బయిపోయింది పార్వతమ్మగారు.

"అయ్యో. మీ కెందుకు తల్లీ శ్రమ? ఇలా వచ్చారు'' అన్న దావిడ జున్ను చూస్తూ.

వాళ్ళిల్లు తన కెంతో తమాషాగా అనిపించింది. కొద్దిగా గిన్నెలు. కుంపటిమీద వంట. చిన్న పీటలు. రెండు మంచాలు. తల్లి మాట వింటూనే పాట - ఆపేశారు మాస్టారు. అతని కళ్ళలో ఆనందాశ్చర్యాలు పోటీ పడడం తాను కనిపెట్టకపోలేదు. తనకి ఎందుకో చాలా సిగ్గు వేసింది.

వెంటనే సద్దుకుంటూ "రంగన్న బయటకి వెళ్ళాడండీ. అమ్మ మీ కిచ్చి రమ్మంది.'' అని కొంటెగా మాస్టార్ని చూస్తూ అంది.

"అయినా మీ అబ్బాయి సొంత కవిత్వం కూడా పాటలుగా పాడడం వచ్చా?'' అంది.

"ఏమలా అంటున్నారు తల్లీ'' అంది ఆవిడ.

"అబ్బే. నా కలా అనిపిస్తూ ఉంటుందండీ, అప్పుడప్పుడు'' అంది తాను.

వెంటనే అర్థం చేసుకున్నారు మాస్టారు.

"ఇది క్షేత్రయ్య పదం రాజేశ్వరీ. అలౌకిక శృంగార రసాన్ని కాల్పనిక భావవ్యక్తీకరణకే కాకుండా, వివిధ భావసౌందర్యాలని, గుణస్వభావాలనీ చక్కగా ప్రదర్శిస్తూ మానవ రూపంలో ఉన్న వ్యక్తుల మధ్య కలిగిన అనుభూతులుగా లలితమైన పదా లతోటి రచన గావించారు క్షేత్రజ్ఞులు. త్యాగయ్య కృతులు కేవలం శ్రవ్యాలు. క్షేత్రయ్య పదాలు దృశ్యతా గౌరవం కూడా పొందాయి. మహానుభావులు.'' పారవశ్యంతో అన్నా రాయన.

అతని పాండిత్యంతో కూడిన ఆ మాటలు తనకి నగం బోధపడ్డాయి. నగం లేదు.

"వస్తానండీ'' అంటూ వచ్చేసింది మరేమీ మాట్లాడకుండా. ఆ రాత్రి జాగారం చేయాల్సి వచ్చింది తనకి.

** ** **

ఓ రోజు సంగీత చర్చ తోటలో చేసుకుంటున్నారు తానూ, మాస్టారూ. తాము గమనించనేలేదు. సడెన్‌గా గాలి మొదలై తుంపర పడసాగింది. ఒక్కసారి తెలివి తెచ్చుకుని ఇంట్లోకి నడవబోయా రిద్దరూ. ఆ హడావిడిలో రాయి తగిలి, తూలి పడబోయింది తాను. అప్రయత్నంగా చేయి అడ్డం పెట్టారు మాస్టారు.

గుండె జల్లుమంది. వెంటనే విడివడలేకపోయింది తాను.

అప్రయత్నంగానే మాస్టారు తనను దగ్గరకు తీసుకున్నారు. మత్తుగా ఆయన అధరాలు "రాజేశ్వరీ'' అన్నాయి. మేడమీద తండ్రి దగ్గు వినబడ్డంతో, భయవిహ్వల అయిన తాను బలవంతాన విడివడి లోనికి పారిపోయింది.

గుండెలో అలజడి చాలాసేపటివరకూ తగ్గలేదు. తండ్రి గదిలోంచి పెద్ద పెద్ద కేకలు వినబడ్డంతో బయటకు వచ్చింది తాను గానీ గుమ్మం దాటి బయటకు నడవలేకపోయింది.

"నీ అంతస్తేవిటి? నా అంతస్తేవిటి? ప్రేమట. ప్రేమ ! నీ సంగీతం వద్దు. నువ్వూ వద్దు. తక్షణం ఇల్లు ఖాళీ చెయ్యి'' అన్న అరుపులు, వెంటనే మాస్టారు బయటకు వెళ్ళడం కనిపించాయి కిటికీలోంచి. తల్లి దగ్గరకు వెళ్ళి ఏడ్చింది తాను.

తలపైన చేయి వేసి ఓదార్చింది తల్లి తనని. మరో అరగంటకి పార్వతమ్మగారు వచ్చి కాళ్ళా వేళ్ళా పడడం, తండ్రి ఆమెని తూలనాడడం చూస్తూనే ఉంది తాను. తండ్రికి ఎదురు చెప్పే ధైర్యం లేదు. గదిలోనే వెక్కి వెక్కి ఏడ్చింది తాను. ఆ సాయంత్రమే మాస్టారు ఊళ్ళోకి మకాం మార్చేసినట్లు తెలిసింది తనకి. భోజనం మానేసి పడుకుండిపోయింది తాను.

ఏం చెయ్యడానికీ తోచేది కాదు. తండ్రి చండశాసనుడు. తల్లి అశక్తురాలు. తన మనను తనకే స్పష్టంగా తెలియడంలేదు. ఆ మర్నాడు మాస్టార్ని ఎవరో కొట్టారని తెలిసింది. నివలేకపోయింది తాను. తండ్రి పొరుగూరు వెళ్ళారు. తల్లిని బ్రతిమిలాడి రాత్రి పదింటికి రంగన్నని తోడు తీసుకుని మాస్టారి ఇంటికి వెళ్ళింది తాను. పార్వతమ్మ మొదట ఆశ్చర్యపోయింది తనని చూసి లోపలి గది బయట గొళ్ళెం పెట్టి బయటకు వచ్చిం దావిడ.

"మాస్టారి కెలా ఉంది?'' గొంతు బొంగురుపోగా అడిగింది తాను.


ఒక్కసారి సాలోచనగా చూసిన ఆవిడ కళ్ళనీళ్ళు కారుతుంటే కొంగు జాపి- "తల్లీ, రాజేశ్వరమ్మా. నాకు పుత్రభిక్ష పెట్టు. వీడు నెలల పిల్లాడప్పుడు ఆయన పోయారు. నా దృష్టంతా వాడిమీదే. ప్రాణాలన్నీ వాడిమీదే. టైముకి చూశాను గాబట్టి దక్కాడు. లేకపోతే రాత్రే అయిపోవలసిన వాడమ్మా'' అంటూ వాపోయిం దావిడ.

చిత్తరువే అయింది తాను.

"ఆడపిల్ల ఇలా రావడం బాగుండదు. తల్లిదండ్రుల మాట జవదాటడం అసలు బాగుండదు. వెంటనే ఇంటికి వెళ్ళమ్మా'' అంటూ - "రంగన్నా జాగ్రత్తగా అమ్మగార్ని ఇంటికి తీసుకుని వెళ్ళు'' అని లోపలి కెళ్ళిపోయిం దావిడ.

గిర్రున వెనుదిరిగి వచ్చేసింది తాను. వెక్కి వెక్కి ఏడుస్తున్న తనని, తల్లి ఓదార్చింది. ఆ తరువాత వాళ్ళు ఊరు వదిలి వెళ్ళిపోయారని విన్నది తాను.

ఏదో శూన్యం ఆవరించినట్లైపోయింది తనకి. మనిషిగా మారడానికి చాలాకాలం పట్టింది. సంగీతమన్నా సంగీత కచేరీలన్నా ఉదాసీనభావం వచ్చేసింది. కానీ శంకరం




మాస్టారు మాత్రం మరపురాని వ్యక్తిగా మిగిలిపోయారు తన స్మృతిపథంలో.

** ** **

"అత్తా. గౌరీపూజ మొదలౌతోందిట. మిమ్మల్ని అమ్మ అర్జెంటుగా రమ్మంటూంది'' అంటూ వచ్చాడు బాబీ.

రాజేశ్వరి ఈ లోకంలోకి వచ్చింది.

"నడు బాబూ. వస్తున్నాను'' అంటూ అతన్ని పంపివేసింది. కొంచెంసేపు దీర్ఘాలోచనలో పడిం దావిడ. ఆపై ఓ నిర్ణయానికి వచ్చింది. మరో అరగంట గడిపి బయట పడింది.

పెళ్ళి మామూలుగా అయిపోయింది. తిరుపతి ప్రయాణానికి దంపతులు బయలుదేరారు. మాస్టారు వచ్చినట్టుగా వాళ్ళ ఇంట్లో శబ్దాలు వినవస్తూ ఉండడం రాజేశ్వరమ్మ గమనించింది. ఆవిడ కూడా ప్రయాణ సన్నాహాల్లో ఉంది. నందిని పెట్టె సద్దుకుందుకు మేడమీదకి వచ్చింది.

"నందినీ, నా కో సాయం చేస్తావా?'' అడిగింది రాజేశ్వరమ్మ.

"ఏమి టత్తా?'' ఆశ్చర్యంగా అంది నందిని.

"మీ మాస్టా రిల్లు దైవాంశసంభూతంగా నాకు కనబడుతోంది. వాస్తు శాస్త్రరీత్యా ఎక్కడైనా కొద్దిపాటైనా నిధి ఉండవచ్చు నని అనుమానంగా ఉంది. నాకు వాస్తు శాస్త్రం తెలుసు. మీ మావయ్య దగ్గర సరదాకి నేర్చుకున్నాను. ను వ్విప్పుడు మీ మాస్టారి దగ్గరకు సెలవు తీసుకుందికి వెడతావు కదా. ఓసారి ఆయనతో 'మాస్టారూ ! నాకు కల వచ్చింది, సింహాసనం కింద గానీ, చుట్టుపక్కల గానీ తవ్వించూడండని చెప్పాలి' ఆ పని ఆయన చేసేలా చూడాలి. నాకు బాగా నమ్మకంగా ఉంది. అందుకే ఇందాక అంతసేపు అక్కడే ఉండిపోయాను'' అన్న దావిడ.

విచిత్రంగా చూసింది నందిని.

ఆమెకి నమ్మకం కలిగేట్లు కొన్ని ఉదాహరించింది ఆవిడ సంతోషంగా ఒప్పుకుని "అక్కడి కిప్పుడెందుకే?'' అని తల్లి అంటున్నా వినకుండా బయలుదేరింది నందిని.

తన పేరు మాత్రం బయటపెట్టవద్దని మరోసారి రహస్యంగా హెచ్చరించింది రాజేశ్వరమ్మ. అందరి దగ్గరా సెలవు తీసుకుని, దంపతులని మరి మరీ తమ ఊరు రావలసిందిగా కోరి బయలుదేరింది రాజేశ్వరమ్మ.

తిరుపతి ప్రయాణం అయాక నందిని, ప్రసాదరావు అమ్మమ్మగార్ని చూడ్డంకోసం రాజేశ్వరి దగ్గరకు వచ్చారు.

"అత్తా, మీరు చెప్పింది నిజం. శ్రీరామపట్టాభిషేకం ఫోటో కింద ఒక అడుగు లోతున ఒక పాత ఇత్తడి బత్తుల పెట్టెలో ఓ పాత గుడ్డలో రెండు జతల గాజులు, ఒక పది తులాల చంద్రహారం దొరికా యత్తా. ఒక పాత కాగితంలో వాళ్ళ తాతగారు మనవడికి చెందాలని రాసినట్లుగా లెటరు కూడా ఉం దత్తా. ఇప్పుడు ఆ ఇంటికి ఏభై వేలు దాకా ఇస్తామంటున్నారు - కింద గచ్చులు లేకపోయినా పైన పెంకు లేకపోయినా. మా మాస్టారుకు డబ్బు ఆశలేదు కదా. తన జీవితం అలాగే అక్కడే వెళ్ళిపోవాలని అన్నారు. మంచి వైద్యం చేయించుకుంటున్నారు.'' కళ్ళు మెరుస్తుండగా అంది నందిని రాజేశ్వరమ్మ తాను ఖాళీగా ఉన్నప్పుడు.

రాజేశ్వరమ్మ మనసు సంతృప్తితో నిండిపోయింది. ✱